నమస్తే తెలంగాణ

జోగుళాంబ గద్వాల
వనపర్తి

5 | మహబూబ్‌నగర్, శనివారం 23 మార్చి 2024 | JOGULAMBA GADWAL WANAPARTHY


# కల్యాణం.. కమనీయం



కందూరులో శివపార్వతుల కల్యాణాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు

- ఘనంగా రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు
- శివనామస్మరణతో మార్మోగిన కందూరు క్షేత్రం

మూసాపేట(అడ్డాకుల), మార్చి 22 : ఆది దంపతులు శివపార్వతుల వివాహ మహోత్సవం కనుల పండువగా నిర్వహించారు. దక్షిణకాశి అయిన కందూరు రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం శివపార్వతుల వివాహ వేడుకను భక్తులు కనులారా వీక్షించి పులకించిపోయారు. మాజీ సర్పంచ్ నాగిరెడ్డి ఇంటి నుంచి పట్టువస్త్రాలు, పసుపు బియ్యాన్ని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి సతీమణి తీసుకొచ్చారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కల్యాణ వేదికపై శివపార్వతులను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెగా ముస్తాబు చేశారు. అనంతరం అర్చకులు శివపార్వతులు కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఈ మహోత్సవాన్ని తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

# ఉత్సాహంగా బండలాగుడు పోటీలు



కందూరులో బండను లాగుతున్న వృషభరాజములు

మూసాపేట(అడ్డాకుల), మార్చి 22 : మండలంలోని కందూరు రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం ఆలయ ప్రాంగణంలో బండలాగుడు పోటీలను నిర్వహించారు. దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి పోటీలను ప్రారంభించారు. పోటీల్లో మొదటి బహుమతి కర్నూల్ జిల్లా వంకూరుకు చెందిన తిరుమలేశ్ రూ.40వేలు, రెండో బహుమతి గద్వాలకు చెందిన గోసాయి వినిల్‌రాయుడు రూ.30వేలు, మూడో బహుమతి వనపర్తి జిల్లా పెద్దదగడకు చెందిన గోపాల్‌కృష్ణ రూ.20వేలు, నాలుగో బహుమతి మానవపాడుకు చెందిన రవీందర్‌రెడ్డి రూ.15 వేలు, ఐదో బహుమతి కర్నూల్‌కు చెందిన జాకీర్‌పాషా రూ.10 వేలు గెలుపొందారు. వీరికి ఎమ్మెల్యే బహుమతులు అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# జడ్చర్ల డిగ్రీ కళాశాలకు న్యాక్ 'ఏ' గ్రేడ్

- హర్షం వ్యక్తం చేసిన అధ్యాపకులు, విద్యార్థులు

జడ్చర్ల టౌన్, మార్చి 22 : జడ్చర్లలోని డాక్టర్ బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు న్యాక్ సంస్థ ఏ-గ్రేడ్ ఇచ్చినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పియ చిన్నమ్మ తెలిపారు. గతేడాది మార్చిలో న్యాక్ బృందం కళాశాలలో పర్యటించి 2.82 సీజీపీఏతో బీప్లస్ గ్రేడ్ ఇవ్వడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు మరోసారి న్యాక్ సంస్థకు అప్పీల్ చేశారు. ఇందుకు ఈ ఏడాది ఫిబ్రవరి 21, 22 తేదీల్లో న్యాక్ బృందం కళాశాలలో పర్యటించింది. విద్యాబోధనలు, సదుపాయాలను గుర్తించిన న్యాక్ బృందం కళాశాలకు 3.24 స్కోర్‌తో ఏ గ్రేడ్ ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి జిల్లాలోనే 'ఏ' గ్రేడ్ సాధించిన మొట్టమొదటి కళాశాలగా జడ్చర్ల డిగ్రీ కళాశాల చరిత్ర సృష్టించింది. కళాశాలకు స్వయం ప్రతిపత్తి హోదా 10ఏండ్ల వరకు ఉంటుందని ప్రిన్సిపాల్ తెలిపారు. రాష్ట్రంలో ఏడు కళాశాలలకు ఇప్పటి వరకు 'ఏ' గ్రేడ్ సాధించగా, ఎనిమిదో కళాశాలగా జడ్చర్ల కళాశాల నిలువడం సంతోషంగా ఉందన్నారు. బొటానికల్ గార్డెన్, బయోడైవర్సిటీ రిసెర్చ్ సెంటర్, అంతర్జాతీయ గుర్తింపు పొందిన రాష్ట్ర హెర్బేరియం, 25 అంశాలపై రిసెర్చ్ చేసిన 8 పుస్తకాలను ప్రచురించడం, 30కేవీ సోలార్ ఎనర్జీ సిస్టమ్, వివిధ విభాగాల్లో అధ్యాపకులు, విద్యార్థులు అవార్డులు దక్కించుకోవటంతోపాటు కళాశాలలో క్రమశిక్షణతో విద్యబోధనలు అందించడం వంటి అంశాలపై న్యాక్ సంస్థ 'ఏ'గ్రేడ్ ఇచ్చిందని వెల్లడించారు. ఈ సందర్భంగా శుక్రవారం కళాశాలలో అధ్యాపకులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తూ పటాకులు కాల్చి నృత్యాలు చేస్తూ సంబురాలు జరుపుకొన్నారు.



జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు న్యాక్ ఏ గ్రేడ్ రావడంతో డ్యాన్స్ చేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

### వాహనాల తనిఖీల్లో

# రూ.8లక్షలు స్వాధీనం



బుర్రవాగు చెక్‌పోస్ట్ వద్ద నగదును స్వాధీనం చేసుకున్న పోలీసులు

పెద్దమందడి, మార్చి 22 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మద్యం, నగదు సరఫరాను అరికట్టేందుకు వాహనాల తనిఖీలను పోలీసులు ముమ్మరం చేశారు. శుక్రవారం మోజర్ల సమీపంలోని జాతీయ రహదారి బుర్రవాగు స్టేజీపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టినట్లు ఎస్సై శివకుమార్ తెలిపారు. ఈ తనిఖీల్లో హైదరాబాద్ నుంచి కర్నూల్‌కు వెళ్తున్న వాహనంలో రూ.8లక్షల నగదును పట్టుకున్నారు. ఈ డబ్బులకు ఎలాంటి ధ్రువపత్రాలు లేకపోవడంతో స్వా ధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. రూ.50వేలకు మించి నగదును తీసుకెళ్తే వాటికి సంబంధించిన ధ్రువపత్రాలను చూపించాల్సిందిగా చెప్పారు.

### జోరుగా వేరుశనగ కొనుగోళ్లు

జడ్చర్ల, మార్చి 22 : బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం వేరుశనగకు అత్యధికంగా క్వింటాకు రూ.7,239 ధర పలికింది. మార్కెట్‌కు 850క్వింటాళ్ల వేరుశనగ అమ్మకానికి రాగా క్వింటా కు గరిష్ఠంగా రూ.7,239, కనిష్ఠంగా రూ.4,029, మధ్యస్తంగా రూ.6,767ధర పలికింది. అదే విధం గా మినుములు క్వింటాకు రూ.7,332, ఆముదాలు క్వింటాకు రూ.6,024, పెబ్బర్లు క్వింటాకు రూ.6,600, జొన్నలు క్వింటాకు రూ.5,200, మొక్కజొన్న క్వింటాకు రూ.2,234 ధర పలికాయి.

### భాగ పరిష్కారానికి వృద్ధురాలి అవస్థలు



సింగాయిపల్లికి చెందిన వృద్ధురాలు శ్రీశైలమ్మ భూ సమస్య పరిష్కారం కోసం ఏదుల తాసీల్దార్ కార్యాలయానికి కూతురు సాయంతో వచ్చింది. ఈమె కుటుంబంలో మొత్తం ఐదుగురు(భాగస్తులు) పాలివారు. అయితే, వీరి మధ్య కొన్నేండ్ల నుంచి భాగపరిష్కార సమస్య ఉన్నది. ప్రస్తుత ప్రభుత్వం భూ సమస్యల సవరణలకు అవకాశం కల్పించడంతో ఆమె కోడేరు మండలానికి వెళ్లింది. అక్కడి అధికారులు మీ మండలం ఏదుల అని చెబితే.. తిరిగి కొత్త మండలానికి వచ్చి తాసీల్దార్‌తో ఆమె సమస్యను మొర పెట్టుకున్నది. అంతకుముందే వనపర్తి కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి వచ్చిన ఆమెకు ఇన్ని కార్యాలయాల చుట్టూ తిరగడంతో అసలు సమస్యను మరిచిపోయేలా అయ్యింది. తను కొన్నేండ్ల నుంచి భాగపరిష్కార సమస్యను పరిష్కరించుకుందామంటే ఇన్ని అవస్థలు పడాల్సి వస్తుందని వాపోతున్నది. చివరకు భాగపరిష్కార సమస్య పరిష్కారం కోసం కొత్త మండలం ఏదులకు వెళ్లగా తాసీల్దార్ సింగాయిపల్లికి సంబంధించిన రెవెన్యూ భూముల సమస్యలు అమలు కావడం లేదని చెప్పడంతో చేసేదిలేక నిరాశతో వెనుదిరిగింది





ఏదుల తాసీల్దార్ కార్యాలయం

# బంద్దైన బదలాయింపులు !

- భూ క్రయవిక్రయాలకు ఆటంకం
- రిజిస్ట్రేషన్లు లేక ఐదు నెలలుగా ఐదు గ్రామాల ప్రజల అవస్థలు
- అవసరానికి డబ్బులందక రద్దవుతున్న శుభకార్యాలు
- ఇబ్బందులు పడుతున్న ఏదుల మండల ప్రజలు

వనపర్తి, మార్చి 22(నమస్తే తెలంగాణ) : ఐదు నెలలుగా తాసీల్దార్ కార్యాలయంలో భూములకు సంబంధించిన ఎలాంటి రిజిస్ట్రేషన్లు చేపట్టకపోవడంతో ఐదు గ్రామాలకు చెందిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భూములను అమ్ముకున్న వారితోపాటు ధరణి పోర్టల్‌తో అవసరమున్న వారంతా అవస్థలు పాలవుతున్నారు. రిజిస్ట్రేషన్ పక్రియ నిలిచిపోవడంతో భూములు అమ్ముకున్న వారికి సకాలంలో డబ్బులు అందక కొన్ని శుభకార్యాలను సైతం వాయిదా వేసుకుంటున్న పరిస్థితి కొత్తగా ఏర్పడిన ఏదుల మండలంలో చోటు చేసుకున్నది.

వనపర్తి జిల్లాలోని గోపాల్‌పేట మండలంలో ఉన్న ఏదులను 2023 అక్టోబరులో కేసీఆర్ ప్రభుత్వం కొత్త మండలంగా ప్రకటించింది. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో భూములను కోల్పోయి. ఏదుల రిజర్వాయర్ నిర్మాణంలో గ్రామస్తులు అందించిన సహకారానికి అప్పటి ప్రభుత్వం కూడా అంతే ప్రాధాన్యతను కనబర్చిన క్రమంలో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి చొరవతో ఏదుల కొత్త మండలంగా ఏర్పాటైంది. ఎనిమిది గ్రామాలతో ఏర్పడిన కొత్త మండలానికి మూడు గ్రామాలు ఏదులతోపాటు చెన్నారం, చీర్కపల్లి గోపాల్‌పేట మండలం నుంచి మరో అయిదు గ్రామాలు సింగాయిపల్లి, రేకులపల్లి, మాస్‌పల్లి, ముత్తిరెడ్డిపల్లి, తుర్కదిన్నెలను కోడేరు మండలం నుంచి కలిపారు. ప్రస్తుతం తాసీల్దార్ కార్యాలయాన్ని ఏదుల పాఠశాల ఆవరణలోని ఓ భవనంలో కొనసాగిస్తున్నారు.

### ఐదు గ్రామాలకు అవస్థలే..

కొత్త మండలం ఏదులలో కలిసిన ఐదు గ్రామాల ప్రజలు రెవెన్యూ శాఖ పరంగా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కోడేరు మండలం నుంచి ఏదుల మండలంలోకి కలిపిన తుర్కదిన్నె, సింగాయిపల్లి, మాస్‌పల్లి, ముత్తిరెడ్డిపల్లి, రేకులపల్లి గ్రామాల్లోని రైతులు ప్రధానంగా భూ సమస్యను ఎదుర్కొంటున్నారు. ఈ గ్రామాల్లోని భూములను అమ్ముకున్న రైతులకు రిజిస్ట్రేషన్ల ప్రక్రియ నిలిచింది. గడిచిన ఐదు నెలల్లో జరిపిన క్రయ విక్రయాలన్నీ పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలకు సమస్యను ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదు. ప్రారంభంలో విద్యార్థులకు వివిధ సర్టిఫికెట్ల జారీ సహితం నిలిచిపోగా, వాటిని మాత్రం మళ్లీ కోడేరు మండల కార్యాలయంలో తీసుకునే విధంగా పునరుద్ధరించారు. ఇక భూములకు సంబంధించిన రిజిస్ట్రేషన్లు, ధరణి పోర్టల్ ద్వారా చేసుకునే పనులన్నీ కూడా నిలిచిపోయాయి. పిల్లల పెండ్లిళ్లు తదితర అవసరాల కోసం అమ్ముకున్న భూముల లావాదేవీలకు సహితం బ్రేకులు పడటంతో చాలా మంది శుభకార్యాలను సైతం వాయిదా వేసుకుంటున్నారు.

### స్పెషల్ డ్రైవ్‌కు దూరం..

భూ సమస్యలేమైనా ఉంటే పరిష్కరించుకోవాలని ప్రస్తుత ప్రభుత్వం స్పెషల్ డ్రైవ్‌కు గడువు ఇచ్చింది. అందులోనూ ఈ ఐదు గ్రామాలకు సంబంధించిన పనులన్నీ నిలిచిపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఇటు పాత మండలం కోడేరు.. అటు కొత్త మండలం ఏదులతోపాటు వీటికి అదనంగా జిల్లా కలెక్టర్ కార్యాలయం వనపర్తికి రెవెన్యూ బాధితులు చక్కర్లు కొట్టక తప్పడం లేదు. ప్రభుత్వం అవకాశం కల్పించినప్పుడైనా మా సమస్యలు తొలగించుకుందామంటే రెంటికి చెడ్డ రేవడిలా మా పరిస్థితి తయారైందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే గత ఫిబ్రవరిలో ఎమ్మెల్యే మేఘారెడ్డి రిజిస్ట్రేషన్ల ప్రక్రియను ఏదుల తాసీల్దార్ కార్యాలయంలో లాంఛనంగా ప్రారంభించారు. కానీ కేవలం వనపర్తి జిల్లా పరిధిలో ఉన్న మూడు గ్రామాలకు మాత్రమే రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి.

### మా రిజిస్ట్రేషన్ నిలిచింది



మేం ఎకర పొలం అమ్ముకున్నాం. ప్రారంభంలో కొంత నగదు తీసుకొని అగ్రిమెంట్ చేసుకున్నాం. మిగితా డబ్బులను రిజిస్ట్రేషన్ చేసిన వెంటనే ఇచ్చే విధంగా మాట్లాడుకున్నాం. డబ్బులు ఇవ్వడానికి రెడీగా ఉన్నారు. కానీ రిజిస్ట్రేషన్లు కావడం లేదు. కోడేరుకు వెళ్తే ఏదులకు వెళ్లమన్నారు. ఏదులకు వెళితే కోడేరు నుంచి అన్ని రికార్డులు రాలేదు రిజిస్ట్రేషన్లు చేయడానికి రాదన్నారు. రెండు చోట్లకు తిరగడం తప్పా మా పనులు మాత్రం కావడం లేదు.

– ఎం.రాములు, మాస్‌పల్లి, ఏదుల మండలం

### పంచాయతీలు తప్పడం లేదు



రిజిస్ట్రేషన్ల ప్రక్రియ నిలిచి పోవడంతో గ్రామాల్లో ఘర్షణలు జరుగుతున్నాయి. పొలం అమ్మిన రైతు డబ్బులు ఇవ్వమంటాడు. పొలం కొన్న రైతు రిజిస్ట్రేషన్ చేయమంటాడు. అధికారులు, ప్రజాప్రతినిధులు మా ఐదు గ్రామాల సమస్యపై దృష్టి సారించాలి. ప్రభుత్వం స్పెషల్ డ్రైవ్ కింద ధరణి ద్వారా భూ సమస్యలను పరిష్కరించుకోవడానికి అవకాశం ఇచ్చింది. ఎక్కడో ఒకచోట మాకు రిజిస్ట్రేషన్‌కు చేసుకునేందుకు అవకాశం కల్పించాలి.

–శ్రీకాంత్‌రెడ్డి, సింగాయిపల్లి, ఏదుల మండలం

### కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం



ఏదుల కొత్త మండలంలో కోడేరు మండలం నుంచి వచ్చిన గ్రామాల భూములకు సంబంధించి ఎలాంటి రిజిస్ట్రేషన్లు కావడం లేదు. ఈ సమస్యను కలెక్టర్ దృష్టికి అనేక దఫాలుగా తీసుకెళ్లాం. చాలా మంది రైతులు భూ సమస్యలపై వస్తున్నారు. ప్రభుత్వం నుంచి వస్తే తప్పా తాము నిస్సహాయులం. మిగిలిన మూడు గ్రామాల రిజిస్ట్రేషన్లు అవుతున్నాయి. దాదాపు నెల వ్యవధిలో 55వరకు రిజిస్ట్రేషన్లు చేశాం. సాంకేతిక సమస్య తొలగితేనే పరిష్కారం లభిస్తుంది.

– రామకృష్ణ, తాసీల్దార్, ఏదుల, వనపర్తి జిల్లా

# దంతనూరులో మాయరోగం



దంతనూర్‌లో జ్వరంతో బాధపడుతున్న గ్రామస్తుడు

- అంతుచిక్కని విషజ్వరాలు
- మంచం పట్టిన 300 మంది
- పరీక్షల కోసం శాంపిల్స్ సేకరణ
- నేటి నుంచి వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్న అధికారులు

మదనాపురం, మార్చి 22 : అంతుచిక్కని విషజ్వరాలు వనపర్తి జిల్లా మదనాపురం మండలం దంతనూరు గ్రామాన్ని పట్టిపీడిస్తున్నాయి. 1600ల జనాభా కలిగిన ఈ గ్రామంలో 300లకు పైగా మంది విషజ్వరాల బారిన పడడంతో భయాందోళనకు గురవుతున్నారు. రోజురోజుకు రోగుల సంఖ్య పెరిగిపోతుండడంతో ఆ గ్రామానికేమైందనే చర్చ మొదలైంది. విషజ్వరాలతోపాటు చికున్‌గున్యా కూడా తోడవడంతో కీళ్ల నొప్పులు, కాళ్ల వాపు రావడంతో నడువలేని పరిస్థితిలో ఉన్నారు. మమ్మల్ని పట్టించుకునే నాథుడే కరువయ్యాడని బాధితులు వాపోతున్నారు. వైద్యాధికారులు గ్రామంలో నాలుగు రోజులపాటు హెల్త్ క్యాంప్ నిర్వహించి చేతులు దులుపుకొన్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రైవేట్ దవాఖానలకు వెళ్లి వేల రూపాయలు ఖర్చు చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, వైద్యాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.



వృద్ధురాలికి సూచనలు చేస్తున్న వైద్య సిబ్బంది

### హెల్త్ క్యాంప్ ఏర్పాటు చేస్తాం..



దంతనూరులో ప్రజలు జ్వరాల బారినపడిన విష యం వాస్తవమే. వారం కిందట గ్రామంలో హెల్త్ క్యాంప్ నిర్వహించాం. 50 మందికి పైగా బాధితుల రక్త నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపించాం. ఒకరికి మాత్రమే చికున్‌గున్యా ఉందని నిర్ధారణ అయ్యింది. మిగతా వారికి వైరల్ ఫీవర్ వచ్చింది. శనివారం గ్రామంలో మరోసారి హెల్త్ క్యాంప్ ఏర్పాటు చేస్తాం.

– భవానీరెడ్డి, వైద్యురాలు, మదనాపురం పీహెచ్‌సీ

# చేపల పెంపకంతో అధిక లాభాలు

పెబ్బేరు, మార్చి 22 : కొర్రమీను రకం చేపల పెంపకంతో అధిక లాభాలు ఆర్జించవచ్చని పెబ్బేరులోని మత్స్య కళాశాల విద్యార్థులకు రైతులు తెలిపారు. ఎన్‌ఎస్‌ఎస్ శిబిరంలో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలం నెల్లికొండలో శుక్రవారం విద్యార్థులు పర్యటించారు. ఈ సందర్భంగా కొర్రమీను చేపల పెంపకం చేపట్టిన రైతు మధుసూదన్‌రెడ్డితో వారు మాట్లాడారు. అమెరికా నుంచి తిరిగి వచ్చిన ఆయన చేపల పెంపకంలో మంచి లాభాలు ఆర్జిస్తున్న విషయాన్ని తెలుసుకున్నారు. కొర్రమీను విత్తనాల విలువ, వాటి సాంద్రత, మేత సమయం, నాణ్యత, మార్కెటింగ్, లాభాల గురించి ఆయన విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో మత్స్య కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ నాగలక్ష్మి, ప్రోగ్రాం అధికారి దేవానంద్ పాల్గొన్నారు.



చేపలను పరిశీలిస్తున్న విద్యార్థినులు



ఉజ్జెల్లిలో బోరు నీటిని పైపు ద్వారా పంటకు పారబెడుతున్న రైతు శంకర్

# అడుగంటిన జలం.. ఎండుతున్న పొలం

మాగనూరు, మార్చి 22 : పదేండ్లలో ఎన్నడూ చూడని కరువు ప్రస్తుతం రైతుల కంట్లో కన్నీరు తెప్పిస్తున్నది. ఎంతో ఆశతో యాసంగి పంటసాగు చేయగా, సాగునీరు మధ్యలోనే నిలిచిపోయి భూగర్భజలాలు అడుగంటిపోయి వరిపంట ఎండిపోతున్నది. మాగనూరు మండల కేంద్రంలో ప్రస్తుతం పొట్టదశలో ఉన్న వరి పంటలను కాపాడుకునేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నారు. మండల కేంద్రానికి చెందిన రైతు ఉజ్జెల్లి ఆంజనేయులు మూడెకరాలు కౌలుకు తీసుకొని వరిసాగుచేశాడు. సంగంబండ రిజర్వాయర్ నుంచి వచ్చే సాగునీరు ద్వారా పంటలు పండించుకోవచ్చని సాగు చేయగా, ప్రస్తుతం చుక్కనీరు రాకపోవడంతో ఏం చేయాలో పాలుపోని పరిస్థితిలో పడిపోయాడు. పంట పొట్ట దశకు వచ్చి కండ్లముందే ఎండిపోతుంటే నీటి కోసం అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఎలాగైనా పంటను కాపాడుకోవాలని కిలోమీటరు మేర పైపు ద్వారా నీటిని పంటకు పారించే ప్రయత్నం చేస్తున్నాడు. పంటకు రూ.80వేల ఖర్చు చేశానని, పంట ఎండిపోతుండడంతో పెట్టుబడి కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియడం లేదని వాపోతున్నాడు.



మాగనూరులో ఎండిపోయిన పంటను చూపిస్తున్న రైతు ఆంజనేయులు, కొడుకు శంకర్

### అప్పు చేసి పంట సాగుచేసిన..



రెండు ఎకరాల్లో వరి సాగు చేసిన. నీళ్లు లేక పంట ఎండిపోతున్నది. ఏం చేయాల్నో తెలుస్తలేదు. పదేండ్లలో ఎన్నడూ నీళ్లకు ఇంత ఇబ్బంది రాలే. పంట కోసం అప్పు చేసిన. ఉన్న పంట ఎండిపోతే అప్పు ఎట్లా కట్టాలె. ఎండిన పంటను సూడబుద్దయితలేదు. తెచ్చిన అప్పు ఎట్ల కట్టాల్నో తెలువక ఫికరైతున్నది. పంట కోసం తెచ్చిన మందులు తాగి సద్దామంటే భార్య, పిల్లలు అగుడైతరు. సర్కారోళ్లు మా బాధల్ని పట్టించుకొని సాయం చేస్తే బాగుంటది.

– తుక్యానాయక్, పెద్దగూడెం తండా, వనపర్తి జిల్లా